పీఎంశ్రీతో డిజిటల్ పాఠశాలలు

- ఎంపిక చేసిన స్కూళ్లలో ప్రమాణాల పెంపు
- కేంద్రం 60 శాతం నిధుల కేటాయింపు
- మిగిలిన 40 శాతం రాష్ట్రం సమకూర్చాలి
- మండలం నుంచి 10 పాఠశాలల ఎంపిక



పీఎంశ్రీకి ఎంపికైన అనంతపల్లి నంబర్-1 పాఠశాల

నల్లజర్ల: విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యం. అందుక కేంద్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి రాష్ట్రాలకు అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ భారత్ (పీఎంశ్రీ) అనే పేరుతో ఓ పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యలో సమూల మార్పులు తీసుకు రావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం.ఈ పథకం కింద ఎంపికై న పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

రాష్ట్ర వ్యాప్తంగా 662 స్కూళ్ల ఎంపిక

పీఎంశ్రీ పథకానికి నల్లజర్ల మండలం నుంచి 10 పాఠశాలలను ఎంపిక చేశారు. 2021-22 యూడైస్ జాబితా ఆధారంగా 46 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ 10 పాఠశాలలను గుర్తించారు. ఆ వివరాలను విద్యాశాఖ అధికారులు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 662 పాఠశాలలను ఎంపిక చేశారు. అరవై శాతం మార్కులు సాధించిన గ్రామీణ ప్రాంతాల పాఠశాలలను పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు.

మౌలిక వసతులు పెంపు.

ఈ పథకం కింద ఎంపికై న పాఠశాలల్లో విద్యా బోధన, సదుపాయాలు మరింతగా మెరుగు పరుస్తారు. అంతేగాకుండా అదనపు తరగతి గదులు నిర్మిస్తారు. అదనపు వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రిని సమకూరుస్తారు. ఏమేరకు పనులు చేపట్టాలనే అంశంపై జిల్లా స్థాయి కమిటీలు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాయి. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

హెచ్ఎంల నుంచే ప్రతిపాదనలు

ఈ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో ఎలాంటి అదనపు వసతులు కావాలనే అంశంపై ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులే నివేదికలు సమర్పించారు. ఈ నివేదికలు రూపొందించే ప్రక్రియపై ఇప్పటికే విద్యాశాఖ హెచ్ఎంలకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. త్వరలో హెచ్ఎంలు తమ ప్రతిపాదనలను సమగ్ర శిక్ష అభియాన్‌కు పంపితే రాష్ట్రం ప్రభుత్వం నుంచి వాటిని కేంద్రానికి పంపుతారు. ఈ పథకం కింద ఐదేళ్ల పాటు పాఠశాలలకు అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నాడు-నేడు' పథకం వల్ల రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు మారాయి. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక హంగులకు సాంకేతికతను జోడిస్తున్నారు. తరగతి గదులను డిజిటలైజేషన్ దిశగా తీర్చిదిద్దనున్నారు.

పది పాఠశాలల ఎంపిక



ప్రాథమికంగా మండల నుంచి 10 పాఠశాలలు ఎంపిక చేశాం. వాటి జాబితా జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి కేంద్రానికి నివేదిస్తారు. నాతో పాటు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, ఒక సీఆర్పీ బృందంగా ఏర్పడి పాఠశాలలను ఎంపిక చేశాం.

వై.సత్యనారాయణ, ఎంఈఓ-1, నల్లజర్ల మండలం

మరిన్ని సౌకర్యాలు



'నాడు- నేడు' పథకంలో కొంత వరకూ పాఠశాలలను ఆధునీకరించారు. ఇపుడు పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలలకు త్వరలో డిజిటలైజ్‌డ్ తరగతి గదులు, అత్యాధునిక ల్యాబ్‌లు ,బోధన సామగ్రి సమకూరనున్నాయి. పిల్లలు విద్యలో మరింతగా రాణించేందుకు అవకాశం లభిస్తుంది.

-గోపి గోవర్ధన్, ఎంపిక కమిటీ సభ్యుడు, పోతవరం

మండలంలో ఎంపికైన పాఠశాలలు

1.జెడ్పీ హైస్కూల్ నల్లజర్ల
2.జెడ్పీ హైస్కూల్, దూబచర్ల
3.ఎంపీపీ స్కూల్ నంబర్-1, అనంతపల్లి
4.ఎంపీపీ స్కూల్ నంబర్-1, నల్లజర్ల
5.ఎంపీపీ స్కూల్ స్పెషల్, తూర్పుచోడవరం
6.ఎంపీపీ స్కూల్ మెయిన్, తూర్పుచోడవరం
7.ఎంపీపీ స్కూల్, కృష్ణాయగూడెం
8.ఎంపీపీ స్కూల్, చీపురుగూడెం
9.ఎంపీపీ స్కూల్, కమతంగుంట
10.ఎంపీపీ స్కూల్, నంబర్-3, ఘంటావారిగూడెం

ఇవీ ప్రయోజనాలు

- ఎంపికైన పాఠశాలలకు దశల వారీగా నేరుగా నిధులు కేటాయింపు
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర వసతులు
- ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటు
- ప్లాస్టిక్ రహితంగా పాఠశాలలను తీర్చిదిద్దడం
- సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన
- హరిత పాఠశాలలుగా మార్చడం
- బడి ఆవరణలో సేంద్రియ విధానంతో కూరగాయలు, ఆకుకూరల సాగు
- దివ్యాంగ విద్యార్థులకు బోధన పరికరాల ఏర్పాటు
- బాలిక విద్య అభివృద్ధి,సైన్సు ప్రాజెక్టులు
- అందుబాటులోకి గ్రంధాలయం, క్రీడా పరికరాలు
- సోలార్ ప్యానల్స్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం

క్లుప్తంగా

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం



గోపాలపురం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ఎంపిక పోటీలు

గోపాలపురం: రెండు రోజుల పాటు నిర్వహించే మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు మంగళవారం గోపాలపురం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఈఓ జి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్, ఖోఖో, టెన్నికాయిట్, త్రో బాల్ వంటి పోటీలు అండర్-14, అండర్ -17 విభాగాల్లో నిర్వహిస్తారన్నారు. హెచ్ఎం పి .సోమశేఖర్, మండలంలోని వివిధ జెడ్పీ హైస్కూళ్ల, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోషకాహారంపై విద్యార్థినులకు అవగాహన



చాగల్లు ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

చాగల్లు: జాతీయ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థినులకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఊబకాయం, సుగర్, రక్తహీనత రాకుండా రాగులు, సజ్జలు వంటి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఫాస్ట్‌ఫుడ్‌లకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. పద్మావతి తెలిపారు. విద్యార్థినులతో కలసి పాఠశాల వద్ద నుంచి చాగల్లు ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం పి.వీర్రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూగబోయిన పోలీస్ స్టేషన్ ల్యాండ్ ఫోన్

నిడదవోలు: పట్టణ పోలీస్ స్టేషన్ ల్యాండ్ ఫోన్ వారం రోజులుగా పనిచేయడం లేదు. కీలకమైన పోలీసు స్టేషన్ ఫోనే పనిచేయక పోవడంతో వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయాలనుకునే వారికి ఇబ్బంది ఏర్పడింది. నిడదవోలు సర్కిల్ పరిధిలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ వంటి ఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం అందించే అవకాశం లేకుండా పోయింది. ప్రధానంగా మరికొద్ది రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు పర్యటన ఉన్న సమయంలో ఫోన్ పనిచేయకపోవడంతో పలువురు విస్తుపోతున్నారు. వెంటనే మూగబోయిన ఫోన్‌ను పోలీసు అధికారులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్ వరి చేలు



ఉసులుమర్రులో ఈనిక జరిగిన సార్వా వరి పైరు

పెరవలి: ఈ ఏడాది ఖరీఫ్ వరి చేలు ప్రస్తుతానికి ఆశాజనకంగా ఉన్నాయి. మండలంలో వరి చేలు ఈనికల దశలో ఉన్నాయి. జూన్ నెలాఖరులో వేసిన నాట్లు ఈనికలు జరుగుతుండగా జూలైలో వేసిన నాట్లు పొట్ట దశలో ఉన్నాయి. ఈ ఏడాది సార్వా పంట ప్రారంభంలో నీటి ఇబ్బందులు తలెత్తాయి. దాంతో పైరు సక్రమంగా పండుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందారు. ఇప్పుడు ఈనికలు జరిగే ప్రస్తుత సమయంలో వాతావరణం అనుకూలించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో సార్వా సాగు జరిగింది. మండలాల వారీగా నిడదవోలులో 16,500, ఉండ్రాజవరంలో 11,500, పెరవలిలో 8,500 ఎకరాల్లో నాట్లు వేశారు. ముందుగా నాట్లు వేసిన చేలు అనువైన సమయంలోనే ఈనికలు జరుగుతున్నాయని దిగుబడి కూడా బావుంటుందని మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు.

రీసైక్లింగ్ కేంద్రం తనిఖీ

కంబాలచెరువు: స్థానిక లూథర్‌గిరి సమీపాన ఉన్న మున్సిపల్ రీసైక్లింగ్ కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ గంధం సునీత మంగళవారం తనిఖీ చేశారు. అలాగే క్వారీ మార్కెట్ సమీపాన వర్మి కంపోస్ట్ కేంద్రాన్ని కూడా ఆమె సందర్శించారు. విండ్రో కంపోస్టింగ్, వర్మి కంపోస్ట్, సేంద్రియ పద్ధతిలో ఎరువుల తయారీ, గృహ వ్యర్థాలు, హానికర వ్యర్థాల ప్రాసెసింగ్‌లో అనుసరిస్తున్న పద్ధతులు, పరికరాల పనితీరును పరిశీలించారు. వివిధ రకాల వ్యర్థాలను సేకరించడం, వాటిని వేరు చేయడం, రీసైక్లింగ్‌లో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వ్యర్థాలను వేర్వేరుగా ఇవ్వడం వల్ల వారి పని సులభమవడంతో పాటు మరింత మెరుగ్గా రీసైక్లింగ్ చేసే అవకాశం ఉంటుందని న్యాయమూర్తికి నగర పాలక సంస్థ అధికారులు వివరించారు. రీసైక్లింగ్ కేంద్రాల్లోని కార్మికులతో సునీత మాట్లాడి, వారి సేవలను అభినందించారు. అందరూ కచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. వారికి ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చని చెప్పారు.

ఆధారాలు ఉన్నందునే చంద్రబాబు అరెస్టు

- విపక్షాలు బురద జల్లే ప్రయత్నాలు విడనాడాలి
- చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి



చాగల్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

చాగల్లు: స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రమేయం ఉన్నట్టు నిర్ధారణ అయినందునే పోలీసులు ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. చాగల్లులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేర పూరిత ఆలోచనలతో కూడిన రాజకీయాలతో ఇన్నాళ్లూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యవస్థలను మేనేజ్ చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ కుంభకోణంలో అరెస్టయిన చంద్రబాబు తనపై వచ్చిన ఆరోపణలకు కోర్టులో వివరణ ఇచ్చుకొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని టీడీపీ నాయకులు పదే పదే విమర్శలు చేస్తున్నా, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు మాట్లాడుతూ తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందే అన్నారు. కానీ టీడీపీ, జనసేన నాయకులు తప్పు చేసిన చంద్రబాబును వెనకేసుకుని రావడం సిగ్గు చేటన్నారు. ఎస్.ముప్పవరం సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మడు మాట్లాడుతూ స్కిల్ స్కాంలో అవినీతి జరిగినట్టు సీఐడీ నిగ్గు తేల్చాకే చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపారన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, సర్పంచులు మట్టా వెంకట్రావు, మద్దుకూరి రవిప్రసాద్, కుదప రాంబాబు, మేకా రాజు, ఇంటి వీర్రాజు, జాలెం వెంకట్రావు, పొన్నాడ సింహాద్రి, ఉయ్యూరి జోషిబాబు, కంకటల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో వైద్యానికి ప్రాధాన్యం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దూబచర్లలో ఫ్యామిలీ డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైద్య రంగానికి ప్రాధాన్యం పెరిగిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోని దూబచర్ల హెల్త్ సబ్ సెంటర్ వద్ద మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టాక ఆరోగ్యశ్రీ పథకానికి ఊపిరి వచ్చిందన్నారు. 'నాడు-నేడు' పథకంలో ఆసుపత్రులు మెరుగుపడ్డాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో వైద్య బృందాలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధరరావు, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పంది సత్యనారాయణ, ద్వారకాతిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యుడు తొమ్మండ్రు రమేష్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు చేబ్రోలు బాలాజీ, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ మునాఫ్, అమూల్ పాల సొసైటీ అధ్యక్షురాలు నందమూరి లోహిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అధికారులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజశేఖర్

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీడీఓ రాజశేఖరం సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ఈ నెల 15 నుంచి వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ, వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి, అవసరమైన వారికి వైద్య సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వైద్య సేవలు అందించేందుకు మండలంలోని ఇద్దరు వైద్యులతో పాటు ప్రభుత్వం మరో ఇద్దరు వైద్య నిపుణులను నియమిస్తుందని చెప్పారు. గ్రామాల్లో సౌకర్యాలు ఉన్న ప్రాంతంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులతో పాటు రక్తహీనత ఉన్న బాలికలకు శిబిరానికి వచ్చే ముందే స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, వైద్యుల సమన్వయంతో గ్రామాల్లో వైద్య శిబిరాల షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, తహసీల్దారు కిశోర్‌కుమార్, డాక్టరు సిరాజుద్దీన్, సీహెచ్ఓ ప్రసాద్, ఎంఈఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మహా పూర్ణాహుతి

లక్ష్మీపురం గుడిలో ముగిసిన పవిత్రోత్సవాలు



ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం నిర్వహించిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఆలయంలో పవిత్రావరోహణ, పూర్ణాహుతి, మహా శాంతి హోమాన్ని అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం పండితులు, అర్చకులు స్నపన, తిరుమంజనాలు జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లపై, అలాగే ఇతర దేవతామూర్తులపై ఉంచిన దివ్య పవిత్రాలను తొలగించారు. ఆ తరువాత యాగశాలలో మహా పూర్ణాహుతి వేడుకను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఏఈఓ పి.నట రాజారావు పాల్గొన్నారు.

గణనాథుని వేడుకలకు ఏర్పాట్లు



నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లోని పూజా గణపతి కుమార స్వామి ఆలయం వద్ద చవితి సన్నాహాలు

నిడదవోలు: వినాయక నవరాత్ర మహోత్సవాలకు వివిధ ప్రాంతాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. గణపతి ఆలయాలను, చవితి మండపాలను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. పట్టణంతోని పాటు గ్రామాల ప్రధాన సెంటర్లలో ప్రత్యేక మండపాలు, చలువ పందిళ్ల ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమై ఉన్నారు. పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్‌లోని శ్రీపూజ గణపతి కుమారస్వామి ఆలయం వద్ద ఏటా చవితి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఇక్కడ 101వ గణపతి నవరాత్ర వార్షికోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు తెలిపారు. రోజు రాత్రి పూట వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఉప్పులూరి వీరభద్రరావు, ఆదిలక్ష్మీ సరస్వతి దంపతులు ఆర్థిక తోడ్పాటుతో హైదారాబాద్ నుండి 16 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ఇప్పటికే తీసుకు వచ్చారు. కాగా పట్టణంలోని కుమ్మర్ల వీధిలో మహిళలు మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. మట్టి ప్రతిమలను సైజును బట్టి రూ.50 నుంచి రూ.350 రేటుకు విక్రయిస్తున్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్లోని సిద్ధివినాయక, కుమార సబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయం, గౌడ వీధిలోని వినాయక ఆలయం, రైల్వేస్టేషన్ సెంటర్, జండాల వీధి, యాదవుల వీధి, ఉజ్జిన వారి వీధి, పంగిడి రోడ్డు, రాయిపేట వినాయక ఆలయాల వద్ద ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదు పోలింగ్ కేంద్రాల మార్పు

- కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు ప్రకటించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాళ్లపూడి మండలంలో నాలుగు, చాగల్లు మండలంలో ఒక పోలింగ్ కేంద్రం మార్పునకు ప్రతిపాదించామన్నారు. ఇప్పటి వరకూ అందిన ఫారం -6,7,8 పురోగతి గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. జూలై 21 నుంచి ఇప్పటి వరకూ నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఫారం-6లు, మరణించిన, గ్రామాంతరం వెళ్లిన వారి ఓట్ల తొలగింపునకు సంబంధించి 2939 మందిని గుర్తించగా, వారిలో 2476 మంది దరఖాస్తులను ఆమోదించామని ఆర్డీవో చెప్పారు. 499 మంది ఇంకా పెండింగ్‌లో ఉన్నారని, 14 మందిని తొలగించామన్నారు. ఓటర్ల జాబితాల్లో పేర్లు తప్పులు, చిరునామాలు, మార్పులు తదితర వాటికి సంబంధించి ఫారం -7 లో 2,770 మందిని గుర్తించగా, వాటిలో 2,401 మందిని అనుమతించామని చెప్పారు. 331 మందిని పెండింగ్‌లో ఉంచగా, మిగిలిన 38 మందిని తొలగించామన్నారు. ఫారం-8 కింద 6,511 మందిని గుర్తించగా వారిలో 4,962 మందిని అనుమతించగా 1479 మందిని పెండింగ్‌లో ఉంచామని వివరించారు.70 మందిని తొలగించినట్లు తెలిపారు. సమావేశంలోలో వైఎస్సార్ సీపీ తరపున జొన్నకూటి విజయమోహన్‌కుమార్, తహసీల్దార్లు బి.నాగరాజు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ జిల్లా కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు

దేవరపల్లి: విశ్రాంత ఉద్యోగుల బకాయిలను నగదు రూపంలో చెల్లించి ఆదుకోవాలని మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆ సంఘ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు పప్పు వెంకట రామారావు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం ఇక్కడ జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఆర్ బకాయిలు ప్రభుత్వం చెల్లించవలసి ఉందన్నారు. విశ్రాంత ఉద్యోగులు అనారోగ్య ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వం సానుభూతితో స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ నెల 24, 25 తేదీల్లో కాకినాడలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సూర్యప్రకాశరావు కోరారు. సభల్లో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. ఐక్య పోరాటాల ద్వారా విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయనన్నారు. సమావేశంలో సంఘం మండల గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు సయ్యద్ ఆలీ, ఉపాధ్యక్షుడు ఈద్పుగంటి నాగేశ్వరరావు, వెచ్చర్ల సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ బహిరంగ సభ విజయవంతం చేయాలి

పెరవలి: ఈ నెలలో నిడదవోలులో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభకు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్ కోరారు. మండలంలోని డ్వాక్రా వీఏఓలతో మంగళవారం సాయంత్రం పెరవలిలోని వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత నిధులను విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి ఈ నెలలో నిడదవోలు వస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వచ్చేటపుడు మార్గమధ్యంలో డ్వాక్రా మహిళలు ఘన స్వాగతం పలకాలని కోరారు. ఎంపీడీఓ దామోదరరావు మాట్లాడుతూ బహిరంగ సభకు వచ్చే వారి కోసం బస్సులు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శా ఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ. ఏపీఎం నాగరాజు, కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

నిడదవోలు రూరల్: ఈ నెలలో నిడదవోలులో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ విజయవంతానికి అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ పి.శామ్యూల్ సూచించారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లపై మంగళవారం ఆయన సమీక్ష జరిపారు. ఈఓపీఆర్డీ రత్నమాలిక, కార్యాలయ ఏఓ రత్నరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి వనిత పర్యటన..

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం ఉదయం 11 గంటలకు చాగల్లు మండలం నెలటూరు గ్రామంలో నిర్వహించే కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు కొవ్వూరు మునిసిపల్ కార్యాలయంలో కొత్త పింఛనుదారులకు పింఛన్ల సొమ్ము అందజేస్తారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు కొవ్వూరు యువరాజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని 22వ వార్డులో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

కొత్తగా 2,009 మందికి పింఛన్ల మంజూరు

నేడు ఎమ్మెల్యే తలారి చేతుల మీదుగా పంపిణీ

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని మూడు మండలాలకు ఈ నెల కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. అర్హత గల లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలకు 2009 కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. కొత్తగా దేవరపల్లి మండలానికి 620 పింఛన్లు మంజూరవగా, ఇప్పటి వరకూ 11,643 మంది ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందుకుంటున్నారు. గోపాలపురం మండలానికి కొత్తగా 651 పింఛన్లు మంజూరవగా, ఇప్పటి వరకు 8733 మంది పింఛన్లు పొందుతున్నారు. నల్లజర్ల మండలంలో కొత్తగా 738 పింఛన్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 11710 మంది పింఛన్లు తీసుకుంటున్నారు. ఈ నెల నుంచి మూడు మండలాల్లో 34,095 మంది లబ్ధిదారులు పింఛన్ తీసుకోనున్నారు. కొత్త పింఛన్‌దారులకు బుధవారం మూడు మండలాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొత్తగా 24 మందికి పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ లలితకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెం పంచాయతీ పరిధిలో కొత్తగా 24 మందికి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు మంజూరయ్యాయి. ఈ పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు మంగళవారం సర్పంచ్ మెండే లలిత కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పెదప్రోలు వెంకటలక్ష్మి చేతుల మీదుగా ఆ గ్రామంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుద్దుపూడి కాశీ విశ్వనాథం, నందిన శ్రీనివాసరావు, పెదపోలు వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ అసిసెంట్స్ ఎస్.రఘురాం తదితరులు పాల్గొన్నారు.